క్లుప్తంగా

దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలి



మాట్లాడుతున్న ఆర్డీటీ ఎస్టీఎల్ ఎల్లమ్మ

కంబదూరు: దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలని ఆర్డీటీ ఎస్టీఎల్ ఎల్లమ్మ, వైఎస్సార్సీపీ యువజన నాయకుడు భీమేష్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో ఆర్డీటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగులు ర్యాలీ, మానవహారం నిర్వహించారు. అనంతరం ఆర్డీటీ పాఠశాలలో సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగులు సకలాంగులకు దీటుగా ముందుకెళ్లాలన్నారు. ఇటీవల కాలంలో దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఆర్డీటీ సీఓ రాజశేఖర్, లీడర్లు రామాంజి, మైలారి, సాకమ్మ, సునందమ్మ, మాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణించాలి

బ్రహ్మసముద్రం: విభిన్న ప్రతిభావంతులు ఉన్నత లక్ష్యం ఉంటే చాలు.. అన్ని రంగాల్లో రాణించగలరని వక్తలు పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సుమతి, జెడ్పీటీసీ ప్రభావతి, ఎంపీడీఓ నందకిశోర్, ఎంఈఓ ఓబుళపతి హాజరయ్యారు. కార్యక్రమంలో మండల బాలాజీ దివ్యాంగుల సమైక్య సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కంబదూరు: ఉద్యాన పథకాలను ఎస్సీ, ఎస్టీ రైతులు సద్వినియోగం చేసుకోవాలని హెచ్ఎం గౌసియా బేగం సూచించారు. సోమవారం స్థానిక ఆర్డీటీ కాలనీ ఎస్సీ,ఎస్టీ రైతులకు ఉద్యాన శాఖ ద్వారా అమలు అయ్యే పథకాలపై అవగాహన కల్పించారు. హెచ్ఓ మాట్లాడుతూ చీనీ, మామిడి, జామ, బొప్పాయి, నేరేడు, డ్రాగన్ ఫ్రూట్స్, అంజూర తదితర పండ్లతోటల పెంపకానికి ప్రోత్సాహం ఉంటుందన్నారు. మండల మేనేజర్ హుస్సేన్ పీరా, రైతు సేవా కేంద్రం సిబ్బంది మోనా, స్నేహ పాల్గొన్నారు.

ఒకేషనల్ విద్యార్థులకు శిక్షణ

ఉరవకొండ: స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలోని ఒకేషనల్ విభాగంలోని అకౌంటింగ్ అండ్ ట్యాక్సేషన్ (ఏఅండ్‌టీ) గ్రూపు విద్యార్థులకు ఆన్ ది జాబ్ ట్రైనింగ్ ఇచ్చారు. ఇంటర్ కళాశాల ప్రిన్సిపాల్ మమత మాట్లాడుతూ ఈనెల 1 నుంచి బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కమిషనర్ ఉత్తర్వులు మేరకు ఏఅండ్‌టీ విద్యార్థులకు జాబ్ ట్రైనింగ్ ఇచ్చినట్లు తెలిపారు. సోమవారం స్థానిక స్టేట్‌బ్యాంకు ఇండియా ప్రధాన బ్రాంచ్‌ను విద్యార్థులతో కలిసి సందర్శించారు. అధ్యాపకులు కమాలక్షమ్మ, యమున పాల్గొన్నారు.

చదువే అన్నింటికీ మూలం



అవార్డు, నగదు అందిస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: చదువే అన్నింటికీ మూలమని బీమా గ్రూప్ ఆఫ్ మెరిట్ అవార్డ్స్ ఫౌండర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల (కొత్తూరు) ఇంగ్లిష్ లెక్చరర్ కేజే సిద్దేశ్వర ప్రసాద్ తెలిపారు. సోమవారం కొత్తూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్ సిద్దేశ్వర ప్రసాద్ జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల్లో టాపర్లు నలుగురికి రూ. 5 వేలు నగదు బహుమతి, మెడల్స్, మొదటి టాపర్‌కు రూ.10 వేల నగదు, గోల్డ్ మెడల్‌తో ప్రోత్సహిస్తున్నారు. కార్యక్రమానికి అతిథులుగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వీరేష్, బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విజయభాస్కర్, ఉరవకొండ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మమత, అనంతపురం కేఎస్ఆర్ బాలికల కళాశాల ఫిజిక్స్ లెక్చరర్ రంగరాజు, నార్పల కళాశాల లెక్చరర్ లక్ష్మీ రంగయ్య హాజరయ్యారు. రాయదుర్గం జూనియర్ కళాశాలకు చెందిన పోషిక (975 మార్కులు)కు గోల్డ్‌మెడల్‌తోపాటు రూ.10 వేల నగదు, అనంతపురం బాలుర జూనియర్ కళాశాల విద్యార్థి మణిచంద్ (974 మార్కులు)కు రూ.5 వేల నగదు, ఉరవకొండ కళాశాల విద్యార్థులు సిద్దేశ్‌కుమార్ (954 మార్కులు), అనిల్‌కుమార్ (916)లకు రూ. 5వేల నగదు, మెడల్స్‌తో సత్కరించారు.

పైప్‌లైన్ మరమ్మతు



పైప్‌లైన్ మరమ్మతు చేయిస్తున్న దృశ్యం

రాయదుర్గం టౌన్: కణేకల్లు రోడ్డు రైల్వే గేటు నుంచి సీబీఎస్ కాలనీకి వెళ్లే తాగునీటి పంపింగ్ పైప్‌లైన్ లీకేజీ మరమ్మతు పనులను సోమవారం చేపట్టారు. దాదాపు ఆరు నెలల నుంచి పైప్‌లైన్ లీకేజీతో తాగునీరు వృథా అవుతుండేది. దీనిపై ఇటీవల 'సాక్షి'లో తాగునీరు వృథా శీర్షికన వార్త ప్రచురితమైంది. అధికారులు లీకేజీని అరికట్టేందుకు సోమవారం పనులు ప్రారంభించారు. ఏఈ నరసింహులు, ఫిట్టర్లు జగన్నాథ్, కిష్టప్ప ఆధ్వర్యంలో పనులు జరుగుతున్నాయి. బుధ వారం నీరు సరఫరా చేస్తామని ఏఈ తెలిపారు.

తాళాలు వేసిన ఇళ్లే టార్గెట్

- ఆలయాలు, ఇళ్లు, వ్యాపార సముదాయాల్లో దర్జాగా చోరీలు
- వరుస దొంగతనాలతో జనం బెంబేలు
- పోలీసులకు సవాల్ విసురుతున్న దొంగలు



ఉరవకొండ: దొంగలు.. పగలు,రాత్రి తేడాలేకుండా దర్జాగా దొంగతనాలు చేస్తున్నారు. తాళం వేసిన ఇళ్లు, ఆలయాలు, వ్యాపార సముదాయాలను టార్గెట్ చేసుకొని ఎంచక్కా చోరీలకు పాల్పడుతున్నారు. పట్టపగలే దోచుకుంటూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు. అక్టోబర్, నవంబర్ నెలల్లో ఎక్కువగా చోరీలు జరిగాయి. కొన్ని చోరీ ఘటనలు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. దొంగలను పట్టుకోవడంలోనూ, చోరీ సొమ్ము రికవరీ చేయడంలోనూ పోలీసులు విఫలమయ్యారు.

రికవరీలపై పోలీసులకు శ్రద్ధ ఏదీ?

ఉరవకొండ అర్బన్ పోలీసు స్టేషన్ పరిధిలో వరుస చోరీలు జరుగుతున్నా రికవరీలు మాత్రం కన్పించడం లేదన్న విమర్శలు వ్యక్తం మవుతున్నాయి. కేవలం చోరీ కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారే తప్ప రికవరీలపై పోలీసులు దృష్టి పెట్టడం లేదన్న వాదన బలంగా విన్పిస్తుంది. పలు చోరీ కేసుల్లో పక్కాగా సీసీ టీవీ పుటేజీల్లో దొంగతనం దృశ్యాలు కన్పించినా ఆ కేసుల్లో కూడా పురోగతి కన్పించడం లేదు.

కొత్త సీఐకు సవాల్‌గా మారుతున్న చోరీలు..

ఉరవకొండ అర్బన్ సీఐగా మహానంది బాధ్యతలు స్వీకరించిన రెండో రోజే సోమవారం తెల్లవారుజామున ఉరవకొండలోని వీరశైవ నగర్‌లో విశ్రాంత ఆర్‌డబ్ల్యూఎస్ ఉద్యోగి సత్యనారాయణ ఇంట్లో చోరీ జరిగింది. ఇందులో వెండి ఆభరణాలతో పాటు నగదు చోరీకి గురైంది. విషయం తెలుసుకున్న పోలీసులు చోరీ జరిగిన ఇంటిని పరిశీలించి క్లూస్ టీంతో వేలిముద్రలు సేకరించారు. ఈ చోరీలు కొత్త సీఐకు సవాల్‌గా మారుతున్నాయి.

రికవరీపై దృష్టి సారిస్తాం



గతంలో జరిగిన చోరీల వివరాలు తెలుసుకొని వాటి రికవరీపై దృష్టి పెడుతున్నాం. ముఖ్యంగా ఉరవకొండ పట్టణంతో గస్తీ పెంచేలా చర్యలు తీసుకుంటాం. ఇంటికి తాళాలు వేసి ఊళ్లకు వెళ్లే వారు పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇస్తే అలాంటి ప్రాంతాల్లో అదనంగా దృష్టి పెట్టే అవకాశం ఉంటుంది.

– మహానంది, అర్బన్ సీఐ, ఉరవకొండ

రెండు నెలల్లో వరుస చోరీలు



- అక్టోబర్ 4న ఉరవకొండ పట్టణంలోని గవిమఠం ఆవరణలోని రామాంజనేయులు అనే వ్యక్తికి చెందిన కిరాణా దుకాణంలో దొంగలు పడి రూ. 4 లక్షలు నగదు ఎత్తుకెళ్లారు. అనంతరం ఆ షాపు పక్కనే ఉన్న మరో దుకాణంతో పాటు హోటల్ షట్టర్లు ధ్వంసం చేసి, చోరీకి విఫలయత్నం చేశారు.
- అక్టోబర్ 5న తెల్లవారుజామున బూదగవి గ్రామంలో ఆర్‌డీటీ కాలనీలో నివసించే కూరగాయల మండీ నిర్వాహకులు కురుబ ధనంజయ ఇంటి తాళాలు ధ్వంసం చేసి, ఇంట్లో ఉన్న రూ. 2 లక్షల నగదు, ఏడు తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు.
- అక్టోబర్ 24న మండల పరిధిలోని పెన్నహోబిలం పుణ్యక్షేత్రంలో మారెప్ప అనే వ్యక్తి షాపులో దొంగలు చొరబడి రూ.50 వేల నగదు, రెండు తులాల బంగారం ఎత్తుకెళ్లారు.
- నవంబర్ 10న తెల్లవారుజామున పట్టణంలోని బాలాజీ సినిమా హాల్ ఎదురుగా ఉన్న మహదేవ్ ఫెర్టిలైజర్స్ అండ్ ఫెస్టిసైడ్స్ దుకాణంలో దొంగలు చొరబడి రూ. లక్ష నగదు ఎత్తుకెళ్లారు.
- నవంబర్ 23న మండల పరిధిలోని చిన్నముష్టూరులో సాంబయ్య అనే వ్యక్తి ఇంట్లో దొంగలు చొరబడి 10 తులాల బంగారు, రూ.50 వేల నగదు ఎత్తుకెళ్లారు.
- నవంబర్ 25న ఉరవకొండ పట్టణంలోని ఏటీఎం కేంద్రంలో కార్డును ఏమార్చి ఒక వ్యక్తికి చెందిన రూ.79 వేలు నగదును దుండగుడు ఎత్తుకెళ్లాడు.

కాపర్ కేటుగాళ్లు

ట్రాన్స్‌ఫార్మర్లను టార్గెట్ చేస్తున్న దొంగలు

- కాపర్, ఆయిల్, కేబుల్ అపహరణ
- మోటార్లు పని చేయక ఎండుతున్న పంటలు



కూడేరు: దొంగలు ట్రాన్స్‌ఫార్మర్లను టార్గెట్ చేశారు. ట్రాన్స్‌ఫార్మర్లలోని ఆయిల్, కాపర్, కేబుల్ ఎత్తుకెళ్తున్నారు. సులువుగా డబ్బు సంపాదించడానికి వ్యవసాయ పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లను, మోటార్లను ధ్వంసం చేసి, దుండగులు అందులోని సామగ్రి ఎత్తుకెళ్తున్నారు. ఇటీవల కాలంలో కూడేరు మండలంలో 10 వ్యవసాయ పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లను దుండగులు ధ్వంసం చేశారు.

అక్టోబర్ నెలలో కొన్ని...

- జల్లిపల్లిలోని జగనన్న కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి కాపర్, అందులోని సామగ్రి ఎత్తుకెళ్లారు.
- బ్రాహ్మణపల్లి వద్ద ఓ రైతు పొలంలోనూ కాపర్, సామగ్రి ఎత్తుకెళ్లారు.
- కొర్రకోడులో పలువురి రైతుల పొలాల్లో కేబుల్ ఎత్తుకెళ్లారు.
- పోలీసు స్టేషన్‌కు అరకిలోమీటర్ దూరంలో అనంతపురం-బళ్లారి ప్రధాన రహదారి పక్కనే ఉన్న రామసుబ్బా నాయుడు, భాస్కర్ ఇతర రైతుల పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి, అందులోని 200 లీటర్ల ఆయిల్, కాపర్ తీగలను ఎత్తుకెళ్లారు.

డిసెంబర్ నెలలో మరికొన్ని..

- ఈ నెలలో మరుట్ల-2వ కాలనీకి చెందిన కోనేపల్లి గోపాల్‌రెడ్డి, నారాయణ రెడ్డి, గోపాల్ రెడ్డి అనే ముగ్గురు రైతుల పొలాల్లోని మూడు ట్రాన్స్‌ఫార్మర్లను దుండగులు ధ్వంసం చేశారు. అందులో ఉన్న కాపర్, ఇతర సామగ్రి ఎత్తుకెళ్లారు.
- 6న కమ్మూరులో రమణ అనే రైతు పొలంలో, 8న మరుట్ల-3 కాలనీలో రైతు పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేశారు.

లీటర్ ఆయిల్ రూ.220

25 హెచ్‌పీ ట్రాన్స్‌ఫార్మర్‌లో 100 లీటర్లు, 65 హెచ్‌పీ ట్రాన్స్‌ఫార్మర్‌లో 150 లీటర్లు ఆయిల్, రాగి తీగలు 35-50 కేజీలు వరకు ఉంటుంది. ఆయిల్ మార్కెట్లో కంపెనీ బట్టి లీటర్ సుమారు రూ.220 నుంచి రూ.250 ఉంటుంది. రాగి తీగలు కేజీ రూ.1000, అల్యూమినియం కేజీ రూ.300 , కేబుల్ రూ.100 నుంచి రూ.150 వరకు ఉంది.

రూ.65 వేలు ఖర్చు పెట్టుకున్నా



మా పొలం పోలీసు స్టేషన్ వెనుక వైపు అరకిలోమీటర్ దూరంలో అనంతపురం-బళ్లారి ప్రధాన రహదారి పక్కనే ఉంది. ట్రాన్స్‌ఫార్మర్‌ను ఇప్పటికీ నాలుగు సార్లు దుండగులు ధ్వంసం చేసి, అందులో ఉన్న ఆయిల్, ఇతర సామగ్రిని ఎత్తుకెళ్లారు. పోలీసులకు ఫిర్యాదు చేశా. మళ్లీ సుమారు రూ.65 వేలు ఖర్చు పెట్టుకొని ఆయిల్ ఇతర సామగ్రిని సమకూర్చుకున్నా.

– రామ సుబ్బానాయుడు, రైతు కదదరకుంట, కూడేరు మండలం

రైతులు అప్రమత్తంగా ఉండాలి



ఇటీవల కాలంలో రోడ్డు పక్కనే ఉన్న పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లనే దుండగులు టార్గెట్ చేస్తున్నారు. రైతులు అప్రమత్తంగా ఉండాలి. రాత్రివేళలో పొలాల వద్ద కాపలా ఉండాలి. ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించాం. ఎఫ్ఐఆర్ నమోదు చేయించి, మరో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపాం. మంజూరు కాగానే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తాం.

– గౌస్, ట్రాన్స్‌కో ఏఈ, కూడేరు మండలం

శుభకార్యం



వివాహ వేడుకలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత, నాయకులు మెట్టు విశ్వ

కణేకల్లు: వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆదిసద్దురు చంద్రశేఖర్‌రెడ్డి సోదరుడు తుకారం కూతురు కె.సాయిప్రద్వీ, పి.మనోహర్‌రెడ్డి రిసెప్షన్‌కు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి, నాయకులు మెట్టు విశ్వనాథ్‌రెడ్డి, వై.భీమిరెడ్డి, గౌని ఉపేంద్రరెడ్డి, మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, జెడ్పీ మాజీ సభ్యులు పాటిల్ నాగిరెడ్డి హాజరయ్యారు. యర్రగుంట మాజీ సర్పంచు పాటిల్ చెన్నకేశవరెడ్డి, సర్పంచులు ఫణీంద్రగౌడ్, ప్రకాష్‌చౌదరి, భాస్కర్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పైనేటి తిమ్మప్పచౌదరి, మారెంపల్లి మారెన్న, నాయకులు పాటిల్ వెంకటరెడ్డి, యంత్రకాయల వన్నూరప్ప, మాజీ సర్పంచు పాటిల్ బ్రహ్మానందరెడ్డి, ఆలేరి లక్ష్మీకాంతరెడ్డితోపాటు పలువురు వివాహ వేడుకలో పాల్గొన్నారు.

నేటి నుంచి ఉరుసు

వజ్రకరూరు: చాబాలలో ఈనెల 10 నుంచి దర్గాహొన్నూరు స్వామి ఉరుసు ప్రారంభం కానున్నాయి. మంగళవారం రాత్రి కరె నాగప్ప ఇంటి నుంచి గంధం ఊరేగింపుగా దర్గాకు చేరుతుంది. 11న ఉరుసు జరుగుతుంది. రాత్రికి గ్రామంలోని కొమ్మే కుల్లాయప్ప ఇంటి నుంచి షంషీర్ దర్గా చేరుతుంది. అనంతరం రాత్రి 2 గంటల నుంచి స్వామి దర్గా నుంచి బయల్దేరి గ్రామ వీధుల గుండా తిరిగి దర్గా చేరుకుంటారు.

ఉపాధ్యాయుల కొరత తీర్చండి

బ్రహ్మసముద్రం: మండలంలోని మామడూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు కొరత ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు తహసీల్దార్ సుమతికి సోమవారం విన్నవించారు. విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ పాఠశాలలో దాదాపు 90 మందికి పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నట్లు తెలిపారు. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు పాఠశాల ఉందని, నలుగురు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారన్నారు. ఇద్దరు ఉపాధ్యాయులు మెడికల్ లీవ్‌లో ఉన్నారన్నారు. ప్రస్తుతం హెచ్‌ఎంతోపాటు ఇద్దరు మాత్రమే విధులకు హాజరవుతున్నారన్నారు.

సిబ్బందిని నియమించండి

శెట్టూరు: మండల కేంద్రంలోని గ్రామ సచివాలయంలో సిబ్బందిని నియమించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు తహసీల్దార్ ఈశ్వరయ్యశెట్టికి వినతిపత్రం అందించారు. శెట్టూరు సచివాలయంలో డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్లు, వీఆర్ఓ, సర్వేయర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు లేక సేవలు నిలిచిపోయాయన్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సాకే గురుమూర్తి, తిప్పేస్వామి, రామన్న, బాబు, పాలక్షి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

కళ్యాణదుర్గం: ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మండలాల్లో అధికారులకు అందే అర్జీలను పరిశీలించి, వెంటనే పరిష్కరించాలని ఆర్డీఓ వసంతబాబు ఆదేశించారు. స్థానిక రెవెన్యూ డివిజినల్ కార్యాలయంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజా సమస్యలపై అర్జీలను స్వీకరించారు. భూ సమస్యలను ఆయా గ్రామాలలో జరుగుతున్న రెవెన్యూ సదస్సులలో పరిష్కరించుకోవాలని ఆర్డీఓ సూచించారు. కార్యక్రమంలో డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

శ్మశానవాటికను కాపాడాలి



సమస్య చెప్పుకునేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన బెస్త సంఘం నాయకులు

అనంతపురం అర్బన్: రాయదుర్గం పట్టణ సమీపంలోని బెస్త సామాజిక వర్గానికి చెందిన శ్మశానవాటిక ఆక్రమణకు గురికాకుండా కాపాడాలని బెస్త సేవా సంఘం నాయకులు విన్నవించారు. కలెక్టర్ వి.వినోద్‌కుమార్‌ను కలిసి తమ సమస్యను చెప్పుకునేందుకు సోమవారం కలెక్టరేట్‌కు వచ్చారు. బెస్త సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ మాట్లాడుతూ.. పట్టణానికి సమీపంలోని సర్వే నంబర్ 11-1లోని కొండ పోరంబోకు స్థలాన్ని శ్మశాన వాటికగా గత వందేళ్లగా బెస్త సామాజిక వర్గం ఉపయోగించుకుంటోందన్నారు. ఆలయం నిర్మాణం పేరుతో ఈ స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు శేషాద్రిఇ, కోశాధికారి నాగేంద్ర, కార్యదర్శి కుళ్లాయప్ప, రాయదుర్గం సంఘం నాయకులు శ్రీరాములు, గోవిందు, కమలమ్మ పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో ప్రసవం సురక్షితం

బొమ్మనహాళ్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవం సురక్షితమని శ్రీధరఘట్ట వైద్యాధికారి కుమారరాజా అన్నారు. సోమవారం శ్రీధరఘట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. హెల్త్ ఎడ్యుకేటర్ విజయభారతి, సిబ్బంది శివప్రసాద్, ఉమాదేవి పాల్గొన్నారు.

సర్పంచుకు పరామర్శ

కణేకల్లు: తుంబిగనూరు గ్రామ సర్పంచు ఫణీంద్ర గౌడ్ ను వైఎస్సార్‌సీపీ నాయకుడు మెట్టు విశ్వనాథ్ రెడ్డి సోమవారం పరామర్శించారు. సర్పంచు స్వగ్రు హానికెళ్లి ఆయన యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఏ సమస్య వచ్చినా పార్టీ అండగా ఉంటుందని, తాము కూడా తోడుగా ఉంటామని, అధైర్యపడొద్దని భరోసా కల్పించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ సభ్యులు పాటిల్ నాగిరెడ్డి, నాయకులు పాటిల్ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఒంటరి మహిళలకు ఆర్డీటీ ప్రోత్సాహం



మాట్లాడుతున్న విశాల ఫెర్రర్

కళ్యాణదుర్గం రూరల్: ఒంటరి మహిళలకు ఆర్‌డీటీ ప్రోత్సాహం అందిస్తున్నట్లు ఆర్డీటీ మహిళా విభాగం డైరెక్టర్ విశాల ఫెర్రర్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ఆర్‌డీటీ ఆస్పత్రిలో మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా విశాల ఫెర్రర్ మాట్లాడుతూ ఒంటరి మహిళలకు ఆర్‌డీటీ అండగా ఉంటుందన్నారు. ఒంటరి మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ఆవులు, గొర్రెలను రాయితీతో ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ సుబ్బరావు, ఎల్‌టీ రామాంజనేయులు, ఆర్‌డీటీ సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు భోజన సౌకర్యం



భోజనం వడ్డిస్తున్న ఎస్ఐ నాగస్వామి

వజ్రకరూరు: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఉరవకొండ రూరల్ సీఐ చిన్నగౌస్ సహకారంతో 300 మంది గర్భిణులకు సోమవారం భోజన సౌకర్యం కల్పించారు. మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొలక బాల రామాంజనేయులు అధ్యక్షతన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎస్ఐ నాగస్వామి, సర్పంచు మోనాలిసా తదితరులు హాజరయ్యారు. వైద్యాధికారి తేజశ్వి, డీటీ నరేష్‌కుమార్, ఎంఈఓ ఎర్రిస్వామి , ఎంపిహెచ్ఈఓ గురుప్రసాద్, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బేడ బుడగ జంగాలకు ఇళ్ల స్థలాలు ఇవ్వండి

రాయదుర్గంటౌన్: సంచార జీవనంతో బతుకుకీడుస్తున్న బేడబుడగ జంగం పేదలకు ఇంటి స్థలాలు, రూ.5 లక్షల రుణం మంజూరు చేయాలని సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ, ధర్నా చేశారు. స్థానిక ఆర్ అండ్‌బీ అతిథి గృహం వద్ద నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు సీపీఐ పట్టణ సమితి కార్యదర్శి కొ్రేష్ ఆధ్వర్యంలో బేడబుడగ జంగం కుటుంబాలు ర్యాలీ నిర్వహించారు. అక్కడ బైఠాయించి ధర్నా చేశారు. సీపీఐ నాయకులు దుర్గన్న, నరసింహులు, మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి పార్వతి పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

కుందుర్పి: మండల కేంద్రంలో కదరంపల్లి గోపాల్‌రెడ్డి,డాక్టర్ సూర్యనారాయణ, కుందుర్పి సేవా ట్రస్ట్ సౌజన్యంతో మంగళవారం కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు.

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై నిరసన

కూడేరు: రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల తీరుకు వ్యతిరేకంగా అంబేడ్కర్ విగ్రహం ఎదుట సీపీఐ నేతలు సోమవారం నిరసన తెలియజేశారు. సీపీఐ తాలుకా కార్యదర్శి మల్లికార్జున, రైతు సంఘం జిల్లా నాయకులు రమణ నాయకులు శ్రీరాములు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు

బొమ్మనహాళ్: భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మునివేలు అన్నారు. సోమవారం మండలంలోని సిద్ధరాంపురంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ప్రజల నుంచి 12 అర్జీలు వచ్చిన్నట్లు తహసీల్దార్ మునివేలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ రవితేజ, వీఆర్వో రవి తదితరులు పాల్గొన్నారు.

బెళుగుప్ప: మండల పరిధిలోని రామసాగరంలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 13 వినతులు వచ్చాయని తహసీల్దార్ షర్మిళ తెలిపారు. స్థానిక రామాలయ ప్రాంగణంలో గ్రామ సర్పంచ్ రామలక్ష్మమ్మ, అధికారులు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆర్ఐ రమాదేవి, వీఆర్ఓ ఎర్రిస్వామి, సర్వేయర్ ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు రెవెన్యూ సదస్సు

గుమ్మఘట్ట: కలుగోడు గ్రామంలో మంగళవారం గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు ఓ ప్రకటనలో తెలిపారు.

గుమ్మఘట్ట: మండలంలోని 75 వీరాపురం గ్రామంలో మంగళవారం గ్రామ రెవెన్యూ సదస్సును నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. భూ సమస్యలున్న రైతులు రెవెన్యూ సదస్సులో ఫిర్యాదు చేయాలని ఆయన తెలిపారు.

వజ్రకరూరు: మండలంలోని పందికుంట గ్రామంలో గ్రామ రెవెన్యూ సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దార్ నయాజ్ అహమ్మద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామస్థాయిలో భూ సమస్యలను పరిష్కరించాలని లక్ష్యంతో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

సాగునీటి సంఘాల ఎన్నికలపై అవగాహన

బెళుగుప్ప: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శ్రీరంగాపురం, శీర్పి, గంగవరం గ్రామాల చెరువుల సాగునీటి సంఘాల ఎన్నికలపై సోమవారం అవగాహన కల్పించారు. మండల ఎన్నికల అధికారి సుదాకర్ అధ్యక్షతన ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, ఎంఈఓలు మల్లారెడ్డి, ఈఓఆర్‌డీ నాగేశ్వరశాస్త్రితో కలసి వీఆర్‌ఓలు, పంచాయతీ సెక్రటరీలకు అవగాహన కల్పించారు. ఈనెల 11న నోటిఫికేషన్ విడుదల కావడంతో పాటు 14న ఎన్నికలు, అదేరోజున లెక్కింపు ఉంటుందన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసంపై కేసు నమోదు

వజ్రకరూరు: రాగులపాడులోని హంద్రీనీవా ప్రధాన కాలువ వద్ద శనివారం రాత్రి గ్రామానికి చెందిన వెంకటరెడ్డి, సుధాకర్‌రెడ్డి, కురుబ నాగరాజు, కురుబ వశికేరప్ప, కురుబ గంటా వశికేరప్పకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్‌లను గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. అందులోని కాపర్ వైరు, సామగ్రిని ఎత్తుకెళ్లారు. దీనిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగస్వామి తెలిపారు.

ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి

వజ్రకరూరు: విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని చాబాల సర్పంచు మల్లెల జగదీష్ సూచించారు. సోమవారం మండలంలోని చాబాల గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని సర్పంచు మల్లెల జగదీష్ ప్రారంభించారు. హెచ్ఎం నాగేంద్రప్ప, డిజిటల్ అసిస్టెంట్లు జ్యోతి, రామచంద్ర, పీడీ లక్ష్మీప్రసాద్ పాల్గొన్నారు.

12న ఉచిత మెగా వైద్య శిబిరం

ఉరవకొండ: స్థానిక కెనరా బ్యాంకు సమీపంలో గ్రామ పంచాయతీ రోడ్డు వైపు ఉన్న సమైరా పాలిక్లినిక్ వద్ద ఈనెల 12న నియోజకవర్గ ప్రజల కోసం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఉరగాద్రి చౌడేశ్వరి దేవి ఆలయ చైర్మన్ కొత్త శరత్ తెలిపారు. సోమవారం ఆలయ ఆవరణలో మెగా వైద్యశిబిరం పోస్టర్లు, కరపత్రాలు విడుదల చేశారు.

ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాత లక్ష్మయ్య వర్ధంతి

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని నార్త్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాత చెన్నుపాటి లక్ష్మయ్య వర్ధంతి సోమవారం నిర్వహించారు. లక్ష్మయ్య చిత్ర పటానికి పూలమాల వేసి,నివాళులర్పించారు. చెన్నుపాటి లక్ష్మయ్య ఉపాధ్యాయుల అభివృద్ధికి చేసిన పోరాటాలను, ఉద్యమాలను గుర్తు చేసుకున్నారు. రాష్ట్ర కార్యదర్శి గౌని పాతిరెడ్డి మాట్లాడుతూ బ్రిటిష్ కాలంలోనే ఉపాధ్యాయ సమస్యలపై చెన్నుపాటి లక్ష్మయ్య అలుపెరగని పోరాటం చేశారన్నారు.

ఆరుబయట మలవిసర్జనతో అనారోగ్యం

కూడేరు: ఆరుబయట మలవిసర్జన ఆరోగ్యానికి చేటు అని ఎంపీడీఓ కుళ్లాయిస్వామి అన్నారు. సోమవారం కేజీబీవీలో ఎన్‌జీఓ యాపిల్ సంస్థ, ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో మరుగుదొడ్లు వాడకంపై అవగాహన కల్పించారు. ఎస్ఓ ఉమాదేవి,యా పిల్ సంస్థ చైర్మన్ తిరుపాలు, సిబ్బంది కృష్ణమూర్తి, టీచర్లు పాల్గొన్నారు.